# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

JANUARY - 2018

సంవత్సర చందా రూ. 50/-

# టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

## సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | లక్ష్మి గూటం |
| | | రోసీ గూటం |

**Youtube లో satyavanichurchofchrist.com**

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

**SATYA VANI**

P.O.BOX. 80, KAKINADA

PIN : 533004. Ph : 0884 - 2363722

98489 98547, www.satyavanicoc.com

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి - 39 జనవరి - 2018 సంచిక -6


## యువకులకు హెచ్చరికలు

### (Admonition to the Young)

మానవులను సత్ప్రవర్తన గల వారినిగ తయారుచేయు గ్రంథము బైబిలు. బాలబాలికలకు, యౌవను లకు, వృద్ధులకు అందు అనేక హెచ్చరికలు ఈయబడినవి. దేవుని యందు భయభక్తులు కలిగి జీవించు వారి జీవితములు అందు వ్రాయ బడినవి. నేటి యౌవనులు అట్టివారి జీవితముల ననుకరించుట చాల అవుసరము. దేవుని గ్రంథములో యువకులకు ఈయబడిన కొన్ని హెచ్చరికలను ఈరోజు తెలిసి కొందము.

జ్ఞానియైన సొలొమోను ఇట్లు హెచ్చరించుచున్నాడు. "యౌవనుడా, నీ యౌవనమందు సంతోషపడుము, నీ యౌవన కాలమందు నీ హృదయము సంతుష్టిగా ఉండనిమ్ము, నీ కోరిక చొప్పునను, నీ దృష్టియొక్క యిష్టము చొప్పునను ప్రవర్తింపుము; అయితే వీటన్నిటిని బట్టి దేవుడు నిన్ను తీర్పులోనికి తెచ్చునని జ్ఞావక ముంచుకొనుము; లేత వయస్సు నడి ప్రాయమును గతించిపోవునని గనుక నీ హృదయములో నుండి వ్యాకులమును తొలగించుకొనుము, నీ దేహము చెరుపు దాని తొలగించు

కొనుము. దుర్దినములు రాకముందే - ఇప్పుడు వీటియందు నాకు సంతోషము లేదని నీవు చెప్పు సంవత్సరములు రాకముందే, తేజస్సు నకును సూర్యచంద్ర నక్షత్రములకును చీకటి కమ్మకముందే, వానవెలసిన తరువాత మేఘములు మరల రాక ముందే నీ బాల్యదినములయందే నీ సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము" (ప్రసంగి 11:9-10; 12:1,2). సొలొమోను రాజు యిచ్చిన హెచ్చరిక ఈనాడు ఎంతో ప్రాముఖ్యమైనది. నీ యౌవనమందు సంతోషపడుము. గాని దేవుని మరచిపోకుము.

రాజైన యోషీయ ఇశ్రాయేలీ యుల నేల నారంభించి నప్పుడు ఎనిమిదేండ్లవాడై యుండెను. "తన యేలుబడియందు ఎనిమిదవ సంవత్సరమున తానింకను బాలుడై యుండగానే అతడు తన పితరుడైన దావీదు యొక్క దేవునియొద్ద విచారించుటకు పూనుకొనెను" అని వ్రాయబడియున్నది (2 దినవృ 34: 1-3). యోషీయా పదహారేండ్ల యౌవనుడై యుండగానే దేవుని చిత్త ప్రకారము నడువ నిశ్చయించుకొని నందున అతని యేలుబడి జయ ప్రదముగా జరిగెను.

**దేవుని ప్రేమించి గౌరవించాలి :**

యౌవనులు దేవుని ప్రేమించి, గౌరవించి, ఘనపరచవలెను. దేవుని వాక్యము అధికారపూరితమైనదని, బైబిలు ద్వారా ఆయన మనతో మాటలాడుచున్నాడని వారెరుగవలెను. తమ బాల్యదినములయందే వారు తమ దేవుని వాక్యమును ధ్యానించుట నేర్చుకొనవలెను (2 తిమోతి 2:15; కీర్తన 1). వారు తమ బాల్యదినముల యందే నిజదేవుని నారాధించు విధానమును నేర్చుకొనవలెను. పరలోక తండ్రిని యౌవనకాలమందే స్మరణకు తెచ్చుకొనుటకు యేసు ఒక మాదిరిగా యున్నారు. పండ్రేండేడ్ల వయస్సులోనే ధర్మ శాస్త్రోపదేశకులతో దేవుని గూర్చిన సంభాషణలను యేసు దేవాలయములో జరిగించినట్లు మన మెరుగుదుము (లూకా 2:40-52).

యౌవనులను దేవుడు జ్ఞాపకము చేసికొనుచున్నారు. గనుక యౌవనులు దేవుని స్మరణకు తెచ్చు

కొనవలెను. యేసుక్రీస్తు ద్వారా బాలబాలికల యెడల ఆయనకు కలిగిన ప్రేమను దేవుడు వ్యక్తపరచెను. చిన్న పిల్లలను యేసు ఎంతో ప్రేమించెను. అందువలన "చిన్న పిల్లలను ఆటంకపరచక వారిని నా యొద్దకు రానీయుడి; పరలోక రాజ్యము ఈలాటి వారిదే" అని ఆయన బోధించెను (మత్తయి 19:14).

**తల్లిదండ్రులకు విధేయులై యుండాలి :**

యువకులు ఎల్లప్పుడు దేవుని సంతోషపరచు వారిగ జీవించవలెనని దేవుడు కోరుచున్నారు : "పిల్లలారా, అన్ని విషయములలో మీ తల్లిదండ్రుల మాట వినుడి; ఇది ప్రభువును బట్టి మెచ్చుకొనతగినది" అని పరిశుద్ధాత్ముడు హెచ్చరించుచున్నాడు (కొలస్స 3:20). మీ తల్లిదండ్రులు చెప్పునది దేవుని చిత్త ప్రకారము ఉన్నంతకాలము మీరు వారికి లోబడియుండవలసినదే (ఎఫెసీ 6:1-3). ఈ దినాల్లో తల్లిదండ్రులకు అవిధేయులై నడుచుకొను పిల్లలను మనము ఎక్కువ చూచుచున్నాము (2 తిమోతి 3:2). అంత్య దినములలో అట్టిది సంభవించునని పరిశుద్ధాత్ముడు ముందుగానే చెప్పెను. తల్లిదండ్రుల మాట వినని వానికి మోషే ధర్మశాస్త్రము మరణశిక్ష విధించెను (నిర్గమ 21:17; ద్వితి 21:18-21). అయితే నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నీ తల్లిదండ్రులను ఘనపరచవలెనని దేవుడు ఈనాడు కోరుచున్నారు. "నా కుమారుడా, నీ తండ్రి ఉపదేశము ఆలకింపుము. నీతల్లి చెప్పు బోధను త్రోసివేయకుము" అని సామెతలు 1:8లో వ్రాయబడి యున్నది.

మరల సామెతలు 15:5లో "మూఢుడు తన తండ్రి చేయు శిక్షను తిరస్కరించును. గద్దింపునకు లోబడువాడు బుద్ధిమంతుడగును" అని వ్రాయబడి యున్నది.

**క్రమశిక్షణ నేర్వాలి :**

పిల్లలు సత్ప్రవర్తన గలవారై పెరుగవలెనంటే క్రమశిక్షణ అవుసరము. మన పరలోకపు తండ్రి తాను ప్రేమించు వారిని శిక్షించి దండించునని దైవ వేదము బోధించుచున్నది (హెబ్రీ 12:5,6). మన

మందరము పాపములనుండి రక్షింపబడవలెనని ఆయన అట్లు క్రమశిక్షణలో మనల నుంచుచున్నారు. అందుకే తల్లిదండ్రులు తమ బిడ్డలను చిన్నప్పటి నుండియే తగిన క్రమశిక్షణలో పెంచవలెనని దేవుని గ్రంథము బోధించుచున్నది. "బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము వాడు పెద్దవాడైనప్పుడును దాని నుండి తొలగిపోడు" అని సామెతలు 22:6 చెప్పుచున్నది. "బెత్తము గద్దింపును, జ్ఞానమును కలుగజేయును. అదుపు లేని బాలుడు తన తల్లికి అవమానము తెచ్చును". "నీ కుమారుని శిక్షించిన యెడల అతడు నిన్ను సంతోష పరచును. నీ మనస్సుకు ఆనందము కలుగజేయును" అని సామెతలు 22: 15,27లో వ్రాయబడియున్నది. మరల "బెత్తము, వాడని వాడు తన కుమారునికి నిరోధి, కుమారుని ప్రేమించువాడు వానిని శిక్షించును" అని సామెతలు 13:24లో వ్రాయబడియున్నది. తల్లిదండ్రులు క్రమశిక్షణ అలవరచుచుండగా అది తమ క్షేమము కొరకే యని పిల్లలు గ్రహించవలెను.

**యితరులను గౌరవించాలి :**

పిల్లలు తల్లిదండ్రులనే గాక, యితరులను కూడ గౌరవించుట నేర్చుకొనవలెను. నిన్ను వలె నీ పొరుగు వానిని ప్రేమించుము అను హెచ్చరికను బట్టి వారు జీవించవలెను. అంతేకాదు, వారు దుష్టసాంగత్యమును విసర్జించుకొనవలెను. నీ స్నేహితులు చెడ్డవారైన యెడల వారినుండి నీవు తొలగిపోవుట అత్యవసరము. సాధ్యమైనంతమట్టుకు నీ వయస్సు గలవారితోనే స్నేహము చేయుము. ఇంకా నమ్మకమైన క్రైస్తవులతో నీవు స్నేహము చేయగలిగిన యెడల మరీ మంచిది. "మోసపోకుడి. దుష్ట సాంగత్యము మంచి నడవడిని చెరుపును. నీతి ప్రవర్తన గలవారై మేల్కొని పాపము చేయకుడి" యని అపొ.పౌలు 1 కొరింథి 15:33లో హెచ్చరించుచున్నాడు. మరల అతడు ఇట్లు అనుచున్నాడు : "నీవు యౌవనేచ్ఛల నుండి పారిపొమ్ము. పవిత్ర హృదయులై ప్రభువునకు ప్రార్థన చేయువారితో కూడ నీతిని,

విశ్వాసమును, ప్రేమను, సమాధానమును వెంటాడుము" (2 తిమోతి 2:22). "నీ యౌవనమును బట్టి ఎవడును నిన్ను తృణీకరింప నియ్యకుము, గాని మాటలోను, ప్రవర్తనలోను, ప్రేమలోను, విశ్వాసములోను, పవిత్రతలోను విశ్వాసులకు మాదిరిగా ఉండుము" (1 తిమోతి 4:12).

యౌవనులు దేవుని వాక్యము నందున్న శిక్షణను బట్టి తమను శోధనలలోను, చిక్కులలోను ఇరికించు సందర్భముల నుండి దూరముగ తొలగిపోవలెను. యౌవన కాలమందు దేవుడు వారికిచ్చిన జ్ఞానమును బట్టి, శక్తిని బట్టి దేవుని సేవించవలెను. అందరికంటె యౌవనులే ఈనాడు దేవుని కొరకు ఎక్కువ సాధించగలరని, వృద్ధులు కూడ గ్రహించవలెను.

దేవుడు తన అద్వితీయ కుమారుడు యౌవనులకొరకు, వృద్ధుల కొరకు, పాపులందరికొరకు మరణించు నట్లు ఈ లోకమునకు పంపెను. పాపము వలన మానవులను అపవాది చెరలో వేసెను. గాని యేసుక్రీస్తు తన యౌవన రక్తమును సిలువపై చిందించి అందరిని విమోచించు రక్షకుడాయెను. విచక్షణ జ్ఞానము గలిగిన బాల బాలికలు, వృద్ధులుకూడ క్రీస్తు సువార్తకులోబడి, క్రీస్తురక్తము ద్వారా పాపక్షమాపణను ఈనాడు కూడ పొందవచ్చును. అవును, దేవుడు తన కుమారుని ఈ లోకమునకు పంపి, ఆయనను సిలువపై బలి యిచ్చి నప్పుడు నిన్ను మనస్సులో యుంచుకొని ఆపని చేసెను. గనుక ఈనాడు ఆయనను నీవు ఎట్లు మరచిపోగలవు? రేపు నేను నా సృష్టి కర్తను స్మరించుకొందును అనుకొనకుండ ఈనాడే క్రీస్తునందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు నొందుము. క్రీస్తు నామమున నీటిలో ముంచడము బొంది పాపముల నుండి శుద్ధుడవై క్రీస్తు సంఘముద్వారా నీ దేవుని సేవించుము. ఆయన మోక్షాన్ని నీకు ప్రసాదించగలరు.

# పరిచారకులు పరిచర్య చేయుదురు

## (Deacons Serve)

పరిచారకులు స్థానిక సంఘము యొక్క నాయకులు గాక దానికి పరిచర్య చేయువారు. పరిపూర్ణముగా ఎదిగియున్న ప్రతిస్థానిక సంఘము వాక్యానుసారమైన అర్హతలు గల పెద్దలచే నడిపించబడాలని దేవుడు నిర్ణయించియున్నారు. వారి అర్హతలు దైవ గ్రంథములో మన కొరకు రికార్డు చేయబడియున్నాయి. (1 తిమోతి 3:1-7; తీతు 1:5-9).

పరిచారకులైతే పరోక్షముగా మాత్రమే నాయకత్వము వహించునట్లు కనబడుదురు. దేవుడు సంఘములోను, గృహములోను కూడ నాయకత్వ బాధ్యతలను పురుషులకే అప్పగించి యున్నారు. (1కొరింధీ 11:3; 14:34, 35; 1 తిమోతి 2:11-14). అందువలన పరిచారకులుగా యుండ వలసినవారు, అర్హతగలవారు పురుషులే గాని స్త్రీలు కాదు (1 తిమోతి 3:8-13).

స్థానిక సంఘములో పురుషులే నాయకత్వపు స్థానము గలవారు కారు. పరిచారకులు జూనియర్ పెద్దలు కారు. పరిచారకునిగా యున్నంతమాత్రమున ఒకానొక దినమందు పెద్దగా నియమించబడ వచ్చుననే గ్యారంటీలేదు. పరిచారకుడు ఒక దాసుడు. పెద్దలు అతనికి అప్పగించిన బాధ్యత ఏమైనా యుంటే ఆ విషయములో తాను గైకొనే నిర్ణయం పెద్దల అనుమతిని బట్టియే యుండును. అట్టి నిర్ణయములు తాను స్థానిక సంఘమునకు చేయు పరిచర్యను గూర్చినట్టిదైయుండును.

ఇంగ్లీషు బైబిలులో పరిచారకుడు (Deacon) పరిచారకులు (Deacons) అను పదములు 5 మార్లు మాత్రమే అగుపడును. వాటిని 1 తిమోతి 3:10,13; ఫిలిప్పీ 1:1;1తిమోతి 3:8, 12 లలో చూడగలము. పరిచారకుడు, పరిచారకులు అను సంబంధిత

పదములు 67 మార్లు కనబడును. Diakonos అను గ్రీకు పదము సేవకుడు లేక దాసుడు అని తర్జుమా చేయబడినది.

పరిచారకులు యొక్క అర్హతలు, నియమించే విధానము వారి పని మొదలగు వాటిని గూర్చి క్రొత్త నిబంధనలో సరిపడినంత సమాచారము గలదు. అనేకచోట్ల వారు చేయు సేవను బట్టి Deacon అనే పదము వాడబడినను వారు పనిచేయువారు, సహాయము చేయువారే గాని స్థానికసంఘము యొక్క పరిచారకులు కాదు. అయితే సంఘములో ప్రత్యేకముగా పరిచారకులుగా యుండువారి అర్హతలను గూర్చి 1తిమోతి 3:8- 13లో చూడగలము.

**పరిచారకులు పరిచర్య చేయుదురు (Deacons Serve)**

ఇంగ్లీషులో వాడబడిన Deacon అను పదముకు చిన్న చిన్న పనులు చేయుటకు సహాయపడువాడు, సామాగ్రిని సమకూర్చువాడు, ఎవరో ఒకరి దాసుడు, సహాయకుడు కనిపెట్టు కొనియుండువాడన భారములు గలవు. తత్ఫలితముగ సేవకుడు (minister) దాసుడు (Servant) అను పదములు కూడ వారిని వర్ణించుట కుపయోగపడినవి.

Diakonos (పరిచారకుడు అను పదముకు Doulos (దాసుడు అను పదముకు వ్యత్యాసమున్నది దాసుడు (బానిస) తన యజమానితో సంబంధము గలవాడు. గాని పరిచారకుడు ఒక ప్రత్యేక పని గలవాడు స్థానిక సంఘములో యున్న ప్రతి స్థానము పరిచర్య చేయునదే, గాని అధికారమును సూచించునట్టిది కాదు. పెద్దలు (Elders) పాలింతురు. పర్యవేక్షింతురు (హెబ్రీ 13:7, 17; అపో.కా. 20:28). పరిచారకులు పరిచర్యచేతురు.

పరిచారకులకు సంఘములో చేయవలసిన పనియున్నది. ఒక బోధకుడు బోధింపకుండుట ఎట్లు సమంజసము కాదో అట్లే

పరిచారకుడు ఏదైనా పరిచర్యను చేయకుండుట కూడ సమంజసము కాదు. సేవావిధానమే పరిచారకుని పని విధానము.

గ్రీకుభాషలో వాడబడిన Deacon అను పదము బైబిలు ప్రకారము పరిచారకులను వర్ణించునట్టిది. మరల పరిచారకుడు అను పదము కొన్నిసార్లు యింటిలో సేవచేయు దాసుని కూడ వర్ణించునని గుర్తుంచుకొనవలెను (యోహాను 2:5,9). ప్రభుత్వదాసులు (రోమా 13:4). యేసుక్రీస్తు ఒక సేవకుడు (రోమా 15:8; గలతీ 2:17). క్రైస్తవులు ఒండొరులకు దాసులు (మత్తయి 20:26; 23:11). వారు సువార్త సేవకులు (ఎఫెసీ 3:7; 6:12; కొలస్స 1:7,23,25; 4:7; 1కొరింథి 3:5; 2 కొరింథీ 3:6; 6:4; 11:23; 1థెస్స 3:3; 1తిమోతి 4:6), సంఘసేవకులు (రోమా 16:1) మరియు ఒక రాజు యొక్క దాసులు (మత్తయి 22:13).

పరిచారకుల అర్హతలు :

పరిచారకుల కుండవలసిన అర్హతలను గూర్చి 1 తిమోతి 3:8-13లో మాత్రమే చెప్పబడి యున్నది. పరిచారకుడు మాన్యుడై యుండవలెను. అనగా అతడు భక్తిభావము కలిగి గౌరవనీయుడై యుండవలెను. అతడు ద్విమనస్కుడై యుండకూడదు. అనగా సందర్భాన్ని బట్టి, వ్యక్తులను బట్టి మాటలు మార్చువాడు కాకూడదు. రెండు నాలుకలు గలవాడు కాకూడదు. తదుపరి అతడు మద్యపానాసక్తుడు కాకూడదు, ఇంకోమాటలో అతడు మద్యపానము యొక్క ప్రభావితుడు కాకూడదు. 1తిమోతి 3:3ను బట్టి పెద్దలు మద్యపానీయులు కాకూడదు గాని పరిచారకులు దాని సేవింపవచ్చు నని భావింపనే భావించకూడదు. అట్లు తలంచుట కేవలము పొరబాటు. పెద్దలు గాని, పరిచారకులు గాని, సంఘసభ్యులెవరైనను మద్యమును ఏ రీతిగా కూడ సేవించరాదు. ఈ వచనములు మరికొన్ని లేఖన భాగములు కూడ క్రైస్తవులు

మద్యపానమును చేయుట నిషేధించు చున్నవి. సరదాకైనను వారు దాని జోలికి పోకూడదు.

పరిచారకులు దుర్లాభము నపేక్షించువారు కాకూడదు. పరిచారకుడు అక్రమ సంపాదనకు వ్యతిరేకియైన వాడు. అతడు ఇస్కరియోతు యూదా లక్షణముల వంటికి వ్యతిరేకి. మరియు అతడు విశ్వాస మర్మమును పవిత్రమైన మనసాక్షితో గైకొనవాడైయుండవలెను. అనగా పరిచారకుడు దేవుని వాక్యమును బాగుగా గ్రహించుకొనిన వాడై దాని ప్రకారము ప్రవర్తించువాడై యుండ వలెను. క్రైస్తవ్యమును నిష్టగా పాటించుటకు నమ్మదగిన వాడతడు. సువార్త పూర్ణముగా బయలు పరచబడక ముందు అది ఒక మర్మమని చెప్పబడెను (ఎఫెసీ 3:3-11). మిగతా లేఖకులు దానిని నిర్మలమైన మనసాక్షి శుద్ధ మనసాక్షియని వర్ణించారు (1 పేతురు 3:21; హెబ్రీ 9:14; 10:22).

పరిచారకునిగా నియమింప బడక ముందు ఒకడు మొదట పరీక్షింప బడవలెను. అతని క్రైస్తవ జీవితమును, అనుభవమును పరిగణలోనికి తీసికొన వలెను. యేసుక్రీస్తు సేవలో అతడు మంచిపేరు, అనుభవము గలవాడై యుండవలెను. అంతేగాక పరిచారకుని గా యుండువాడు అనింద్యుడై యుండ వలెను, బహిరంగముగా తప్పుదిద్దించు కొనువాడు కాకూడదు. పరిచారకులే కాదు క్రైస్తవులందరు అనింద్యులై యుండ వలెను (1కొరింథీ 1:8; కొలస్స 1:22).

పరిచారకులు ఏకపత్నీ పురుషులై యుండవలెను (1 తిమోతి 3:12). అతడు బహుమంది భార్యలను కలిగి యుండరాదు. లేఖనముల ప్రకారము విడాకులు పొందినవాడు, లేక పునర్వివాహము చేసికొనిన వాడు పరిచారకుడుగా యుండతగడను కొనుట పొరబాటు. ఏకపత్నీ పురుషుడనగా ఆ

మనుష్యునికి ఉన్న భార్య ఒక్కతే అయ్యుండవలెను. బహుమంది కాదు. అంతేకాదు వరిచారకులుగా నియమింపబడ బోయేవారు తమ పిల్లలను తమ యింటివారిని బాగుగా ఏలువారునై యుండవలెనని చెప్పబడినది.

**అపొ.కా.6:1-7లో పరిచారకులు :**

గ్రీకుభాషలో యున్న రెండు పదములలో ఒకటి ఈ పరిచారకులను గూర్చివాడబడినది. పరిచారకులు ఆహారము పంచిపెట్టుటకు ఉపయోగ పడువారు. అపొ.కా.6:1-7లో ఏర్పాటు చేయబడిన పరిచారకులు ఒక ప్రత్యేకమైన పరిచర్యనిమత్తము ఏర్పాటు చేయబడిరి. వారి పరచర్య స్థానిక సంఘములో నియమింపబడు పరిచారకుల బాధ్యతలకు వేరైనది. మరియు అపొ.కా. 6లో పరిచారకులుగా యుండువారి అర్హతలకు కూడ తేడాయున్నది. అపొ.కా. 6లో వారు మంచి పేరుపొందినవారును, పరిశుద్ధాత్మ పూర్ణులైనవారుగా యుండవలసి వచ్చెను.

సంఘములో పరిచర్యచేయు వారు దేవుని వాక్యముల చొప్పున నడిపింబడువారై యుండవలెననునది విదితమే. ప్రత్యేక సేవకులు, పరిచారకులు యొక్క పని భౌతికమే. వారు ఒకవేళ బోధింపవచ్చును, ఉపదేశింపవచ్చును గాని వారి ముఖ్య బాధ్యతలు భౌతికంగా సేవ చేయుటయే. అపొ.కా. 8లో ఫిలిప్పు పరిచారకుడే గాని సువార్తికుడు కూడాను.

**పరిచారకుల ఉప అర్హతలు :**

ఒకడు వరిచారకునిగా నియమింపబడాలంటే, అతని భార్య కూడ భక్తిగల స్త్రీయై యుండాలి. బైబిలు ప్రకారము ఒకడు పరిచారకుడుగా యుండుటకు లేదా ఉండకుండుటకు అతని భార్య కూడ కారకురాలగును (1తిమోతి 3:11). ఈ సూత్రము సంఘములో యున్న మిగతావారికి కూడ వర్తించును. ఉదాహరణకు పెద్దల యొక్కయు పరిచారకుల యొక్కయు పని వారి భార్యల ప్రవర్తన

వలన ప్రభావితమగును. అందువలన వారి భార్యలు భయభక్తులు గలవారై తమ భర్తల పనికి సహాయకు రాండ్రయి యుండవలెను.

కాబోయే పరిచారకుని భార్య కుండవలసిన అర్హతల కంటే పరిచారకునిగా యుండువాని అర్హతలే గొప్పవి. అతడు / ఆమె కూడ మాన్యులై యుండాలి. అనగా గౌరవప్రదముగా, హుందాతనముగా, శాంతచిత్తులై యుండాలి. ఆమె కొండెములు చెప్పునది కాకూడదని బైబిలు చెప్పు చున్నది. ఆమె అన్ని విషయములందు నమ్మకమైనదిగా యుండవలెను (1తిమోతి 3:11). ఆమె మద్యపాని కాకూడదు.

**ముగింపు :**

పరిచారకులు పరిచర్య చేయాలి. 1తిమోతి 3:8-13లో చెప్పబడిన అర్హతలు లేనియెడల ఒకడు పరిచారకుడు కాజాలడు. అతడు తన భార్యకు, పిల్లలకు యజమాని, శిరస్సు. క్రైస్తవ సేవచేయుటలో అతడు ఆసక్తి గలవాడు. అతడు చేయదగిన పని స్థానిక సంఘములో యున్నది. మరియు ఆ పని చేయడానికి అతనికి ఇష్టమున్నది.

నమ్మకమైన పరిచారకులకు ఒక ప్రత్యేక బహుమానము దాచబడి యున్నది. “పరిచారకులై యుండి ఆ పనిని బాగుగా నెరవేర్చిన వారు మంచి పదవిని సంపాదించుకొని క్రీస్తుయేసు నందలి విశ్వాసమందు బహుధైర్యము గలవారగుదురు.” అని వాక్యము చెప్పుచున్నది (1తిమోతి 3:13). పరిచర్యచేస్తు వారు విశ్వాసములో ధైర్యవంతులగువారు. నమ్మకమైన క్రైస్తవు లందరు క్రీస్తు పరిచర్యలో పాల్గొనుటకు ఆసక్తి గలిగి యుండ వలెను. ముఖ్యముగా పరిచారకులు ప్రభువు సంఘపరిచర్యలో నమ్మకముగా కొనసాగుటకు కోరుకొనవలెను.

-లూయిస్ రష్‌మోర్

# విచిత్రమైన సిలువను వీక్షించునప్పుడు

## (When I Survey the Wondrous Cross)

క్రీస్తు యొక్క సిలువను గూర్చి బైబిలులో పలుమారులు మనం చదివి యున్నాము. దానిని గూర్చి అసంఖ్యాకమైన వ్యాసములు లిఖించ బడ్డాయి. సిలువ వేయబడిన యేసును ప్రకటించుటయే క్రొత్తనిబంధన ముఖ్యాంశము (అపో.కా. 2:22-36; 1కొరింథీ 1:17-25). యేసుక్రీస్తు సిలువ వేయబడు దృశ్యమును మన మనస్సులో ఒకసారి చిత్రీకరించు కొంటే మనం ఏమి వీక్షిస్తాము?

మొదటిగా దేవుని అత్యున్నత ప్రేమ యొక్క శక్తిని సిలువలో చూచెదము :

మానవుని యెడల దేవుని గొప్ప ప్రేమ అత్యున్నతముగా సిలువ పై చిత్రీకరించబడినది (యోహాను 3:16,17; లూకా 11:56; 19:10; హెబ్రీ 2:9). ఎవడును నశింపవలెనని దేవుని అభీష్టము కాదు (2పేతురు 3:9). ఆయన దానినుండి తప్పించు కొనే మార్గమును సిలువ ద్వారా కలుగ జేసారు. దేవుడు నిన్నెంతగా ప్రేమించు చున్నారో తెలిసికోవాలంటే క్రీస్తు సిలువను ఒకమారు వీక్షించి చూడుము.

రెండవదిగా పాపము యొక్క ఘోర వాస్తవమును సిలువలో మనము చూతుము :

మానవుల పాపములే క్రీస్తును సిలువకెక్కించెను (2 కొరింథీ 5:21; రోమా 4:25; 1పేతురు 2:24; హెబ్రీ 9:28). పాపమే లేనియెడల సిలువ యొక్క అవుసరత ఉండక పోవును. అయితే పాపము వలన క్రీస్తు కల్వరిలో ఘోరశ్రమలను బాధను అనుభవించెను. క్రీస్తు సిలువలో పాపము యొక్క వాస్తవమును మనము వీక్షించగలము.

ఘోరసిలువను వీక్షించినప్పుడు

**యేసుపాపముకు విరుగుడు అయెనని మనము గమనించగలము :**

యేసు పాప రహితుడు, అయినను మన పాపములను ఆయన భరించెను. మానవుడు తన్ను తాను పాపముల నుండి రక్షించుకొనలేడు. అతడు దేవుని సహాయములేకపోతే నిత్యనాశనము నకు బద్ధుడయ్యాడు. ఆ గొప్ప అవుసరతను క్రీస్తు నెరవేర్చారు (హెబ్రీ 4:15; 7:26; 1పేతురు 2:1,2). క్రీస్తురక్తము వలన మనకు విమోచనము కలిగెను (మత్తయి 26:28). దేవునితో సమాధానము లభించెను (రోమా 5:10). దేవుని ఆజ్ఞలకు లోబడుట ద్వారా క్రీస్తురక్తము వలన క్రొత్తనిబంధనలో చేయబడిన వాగ్దానములను మనము పొందగలుగు చున్నాము (ఎఫెసీ 1:3; గలతీ 3: 26,27).

ప్రభువునకు లోబడుటలో మనము ఆయన వాక్యమును విందుము (రోమా 10:17; యోహాను 5:24), యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించుదుము (యోహాను 8:24; మార్కు 16:16), పాపముల విషయమై మారుమనస్సు పొందుదుము (లూకా 13:3; అపొ.కా. 2:38; 17:30,31). యేసు దేవుని కుమారుడని నోటితో ఒప్పుకొందుము (మత్తయి 10:32; రోమా 10:10; అపొ.కా. 8:37). మరియు పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుదుము (అపొ.కా. 2:38; 22:16).

మనము సిలువను వీక్షించి నప్పుడు అది దేవుని అత్యున్నత ప్రేమను, పాపము యొక్క ఘోర వాస్తవమును, క్రీస్తులో దాని విరుగుడును చూడగలము.

– జిమ్మి యంగ్



# పొలములను చూడుడి

## ( Look on the Fields )

"నశించినదానిని వెదకి రక్షించుటయే" క్రీస్తు యొక్క అవతార ముఖ్య ఉద్దేశ్యము (లూకా 19:10). యిది సమర్పణతో కూడిన కృషియై యున్నది. వెదకుట అనే పదము గ్రీకుభాషలో Zeteo అని యున్నది. Zeteo అనగా కనుగొనుటకు ప్రయత్నించుట, ఆలోచించుటకు, ధ్యానించుటకు, అడిగి తెలిసికొనుటకు, గమ్యమేర్పరచుకొనుటకు చేయు ప్రయత్నము అని చెప్పవచ్చును.

నీవు ఈమధ్య ఏదైనా నశించిన ఆత్మను గూర్చి ఆలోచించావా? ధ్యానించావా? అడిగి తెలిసికొన్నావా? క్రీస్తుయొక్క అడుగుజాడలలో నడువాలని మనం నిశ్చయించుకొంటే (1పేతురు 2:21). మనం అట్టి క్రియాజనకమైన తలంపులను, యోచనలను, ధ్యానించనవసరంలేదా? క్రీస్తు నిజంగా తన కర్తవ్యమును సంపూర్తిగా నెరవేర్చలేదా?

ఆయన దానిని నెరవేర్చడానికి మంచి ఉదాహరణ యోహాను 4లో మనకు కనబడ్తాది. అది ఒక అన్యవాతారవరణంలో, అనగా సమరయుల మధ్యజరిగినది, మరియు ఆయన అపొస్తులులు రొట్టెలను గూర్చియు, భోజనమును గూర్చియు ఆలోచించుకొను సమయంలో జరిగినది (యోహాను 4:8,31,33). వారు ఆత్మలను రక్షించుట కంటే సాంస్కృతిక కర్తవ్యమును గూర్చి చింతన కలిగి యుండిరి (యోహాను 4:27). ఆత్మలను రక్షించే సమయం, స్థలం, ప్రజలు అదికాదని వారు తలంచిరి.

"ఇదిగో మీ కన్నులెత్తి పొలములను చూడుడి; అవి ఇప్పుడే తెల్లబారి కోతకు వచ్చియున్నదని" చెప్పి వారిని ఆయన సూక్ష్మంగా గద్దించారు (యోహాను 4:35). యోహాను సువార్త 4వ అధ్యాయ సందర్భమును బట్టి ఆయన దేనిని గూర్చి మాట్లాడుచున్నారో దానిని బాగుగా ఎరిగినవాడై యున్నట్లు అర్ధమగుచున్నది. సమరయుల మధ్య, వారికళ్ళ యెదుటే,

తన భర్త కాని మనుష్యునితో జీవించు చున్న స్త్రీతో మాట్లాడుచున్న సందర్భములో, ఆయన మాటలు విని అనేకులు ఆయన యందు విశ్వాసముంచిరి (యెహాను 4:17-42). ఆయన శిష్యులు ఆహారము విషయమై ఆలోచన కలిగియుండగా ఆయన తన కర్తవ్యమును నెరవేర్చుటలో ఆసక్తి కలిగి యుండెను.

"ఇదిగో మీ కన్నులెత్తి పొలములను చూడుడి"యని యేసు క్రీస్తు నీతోను, నాతోను ఈనాడు కూడ చెప్పుచున్నారు

" ఆత్మల విషయమై నీవు కన్నులెత్తి చూచుచున్నావా? కోతకు వచ్చియున్న పొలమును గూర్చి నీ వెరిగి యున్నావా! నీవు వారికి సువార్త చెబుతావేమోనని ఎవరైనా నీ కొరకు ఎదురు చూచుచున్నారా?.

-డేటన్‌కిస్సీ

## దాని ఖరీదెంత?

## (What does it Cost ?)

'సులభము చేయబడిన క్రైస్తవ్యము' (Christianity Made Easy) అనే పుస్తకం యేమైనా వున్నదా? యని ఒకతను పుస్తకాలషాపులో అడిగాడు. ఆయన అట్టిదేమీలేదు, వుంటే అన్నిటికంటే అదే ఎక్కువ అమ్ముడై పోవునని ఆ దుకాణ యజమాని జవాబిచ్చాడు.

త్యాగము, బలియాగమును గూర్చి దేవుడు పాత నిబంధన ప్రజలకు నేర్పించారు. హేబెలు తన అర్పణను తెచ్చినప్పుడు దేవుడు దానిని అంగీకరించారు. ఏలయనగా అతడు విశ్వాసముతో దాని నర్పించాడు (హెబ్రీ 11:4). "హేబెలు తన తొలి చూలును పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని కొన్ని తెచ్చెను" అని మోషే హేబెలు యొక్క త్యాగమును గూర్చి వివరించాడు (ఆది.కా. 4:4). అది విశ్వాసముతో కూడిన క్రియ. తనకున్న శ్రేష్టమైన వాటిని దేవుని కర్పించాడు!

తన కుమారుడైన ఇస్సాకును అర్పించుటలో అబ్రాహాము తన శ్రేష్ట మైన అర్పణను అర్పించుటకు సిద్ధ

పడ్డాడు (ఆది.కా.22) అబ్రాహాము యొక్క సంపూర్ణ సమర్పణను దేవుడెరిగి యుండెను.

త్యాగపూరితమైన ఆత్మను గూర్చి దావీదు బాగుగా ఎరిగియుండెను. అనాలోచితముగా అతడు ఇశ్రాయేలీయులను లెక్కించినపుడు దేవుడతని శిక్షించారు. మరణకరమైన ఘోరమైన తెగులు ప్రజలమీదికి పంప బడెను. అరౌనా తన కళ్లమును, దహనబలికి ఎడ్లును, కూర్చుకర్రలను, కట్టెలను రాజుకు ఉచితముగా ఇచ్చుటకు సిద్ధపడెను. ఉచితబలి!? అది స్వవిరుద్ధము. త్యాగము లేక బలి ఉచితం ఏలాగవుతాది? అందుకు దావీదు "ఇట్లు కాదు, నేను నీ సొత్తును ఊరక తీసికొని యెహోవాకు దహన బలులను అర్పించను, న్యాయమైన క్రయధనమిచ్చి దాని తీసికొందునని అరౌనాతో చెప్పెను" (1 దినవృ. 21:24). గనుక అతనికి దావీదు ఆరువందల తులముల బంగారము నిచ్చెను.

మిగిలి పోయిన సంగతులను మనం దేవుని కిచ్చుచున్నామా? మిక్కిలిన ముక్కల నిత్తుమా? పేరు మట్టుకే యిచ్చుచున్నామా? త్యాగ పూరిత స్వభావము క్రొత్త నిబంధనలో కూడ యున్నది. దేవుడు తన శ్రేష్ఠమైన ఏకైక కుమారుని మనకర్పించెను (యోహాను 3:16). యేసు అత్యంత విలువైన దానిని, తన ప్రాణము కొరకు అర్పించెను (ఎఫెసీ 5:23-25). తన శిష్యులు తమ్మును తాముఉపేక్షించుకొని తన సిలువ నెత్తికొన వలెనని యేసు బోధించెను (మత్తయి 16:24).

రోమాలో యున్న క్రైస్తవులు "పరిశుద్ధమును దేవునికి అనుకూలము నైన సజీవయాగముగా తమ శరీరములను సమర్పించుకొనవలెనని" పౌలు వారిని హెచ్చరించెను (రోమా 12:1-2). అన్ని ఉచితముగా సులభముగా పొందే నేటి ప్రపంచములో త్యాగపూరిత స్వభావము శూన్యము. అయితే అది పరిచర్య చేయు క్రీస్తు యొక్క స్వభావముగా నేటికిని యున్నది. దీనిని గూర్చి ఆలోచించుము.

- క్లేరెన్స్ డిలోచ్

# నీకొలాయితులు ఎవరు?

## (The Nicolaitans, Who were they?)

ప్రకటన 2:6,15లో నీ కొలాయితుల యొక్క బోధ, వారి క్రియలను గూర్చి చదువుదుము. ఈ నీ కొలాయితులెవరు? వారి బోధ యేమిటి? వారి క్రియలు ఏమిటి?

నీ కొలాయితులు అను మాటకు 'ప్రజల వినాశనము' అని యర్ధము. వారు ఆదిమ క్రైస్తవ్యములో, మరి ముఖ్యముగా ఆసియాలోని ఏడు సంఘములలో అగుపడు దుష్ట ప్రభావము గల గుంపు అయ్యుండిరి (ప్రకటన 1:11). వారిది బిలాము వంటి బోధవలెయుండెను. వారు "విగ్రహములకు బలి యిచ్చిన వాటిని తినునట్లును, జారత్వము చేయు నట్లును, ఇశ్రాయేలీయులను" అతడు ప్రోత్సాహింప జూచెను (ప్రక 2:14,15; సంఖ్యా 22:25; 2పేతురు 2:15,16; యూదా 1:11). ఈ నీ కొలాయితులు అన్యజనుల అక్రమ కార్యములను చేయుటయేగాక, అపొ.కా. 15:20,29లో సంఘమున కీయబడిన అజ్ఞకు వ్యతిరేకముగా చేయుటకు పూనుకొనిరి. వారు విగ్రహారాధన సంబంధమైన జారత్వములో ముందుండిరి. వారి పండుగలలోని అక్రమ పద్ధతులను ఆదిమ సంఘములో ప్రవేశింప చేయ జూచిరి. 2పేతురు 2:1లో చెప్పబడి నట్లు అబద్ధబోధకులుగా వారు వర్ణించ బడిరి.

నీకొలాయితులను గూర్చి మనకు ఎక్కువ తెలియకపోయినను ఎఫెసులోని క్రీస్తుసంఘము నీ కొలాయితుల క్రియలను ద్వేషించినట్లు మన మెరుగుదుము (ప్రక 2:6). అయితే పెర్గములోయున్న సంఘము వారి భ్రష్టత్వబోధను సహించి యుండెనని కూడ మనం ఎరుగుదుము (ప్రక 2:12-15). బిలాము బోధను, నీ కొలాయితుల బోధను ప్రభువు వ్యతిరేకించారు (ప్రక 2:6,15,11). నిజానికి విగ్రహారాధన సంబంధమైన క్రియ ఏదైనను బైబిలులో వ్యతిరేకించ బడినది. అట్టి దానిని మనం ఎంత మట్టుకైనా ఎదుర్కొనాలి, వెంబడించ కూడదు (1సమూ 15:23; 1కొరింథీ 10:14; గలతీ 5:19,20; ఎఫెసీ 5:5; కొలస్స 3:5).

– మైక్ రైలీ

# అక్కర లేకుండా కాపురమున్నవాడు

## (Unwanted Occupant)

నెహెమ్యా గ్రంథములో ఆసక్తి జనకమైన సంఘటన ఒకటి రికార్డు చేయబడినది. దేవాలయపు సామాగ్రి తన పర్యవేక్షణలో యున్న యాజకు డొకడు అతని బంధువైన వాని నొకని ఆలయ సామాగ్రి యుంచు గది దగ్గర నివసించుటకు అనుమతించెను. ఆ సమయములో నెహెమ్యా యెరూషలేములో లేడు. అతడు గనుక ఉండి యుంటే ఇట్టి సంఘటన ఎన్నడు జరుగనీయడు. అయితే అతడు తిరిగి రాగానే అక్కరలేకుండా దేవాలయపు గదులలో ఒక దానిలో నివసించు వాని సామాగ్రిని అతనిని బయటకు పారవేసాడు. అప్పుడు మాత్రమే లేవీయులకు అవుసరమైన సామాగ్రిని దాని యందు ఉంచుటకు వీలు కలిగెను (నెహెమ్యా 9:4-10).


టోబియా అను నతనిని దేవాలయపు గదులలో నుండకుండా నెహెమ్యా ఎట్లు పారవేసాడో, దుష్టత్వము వలన మన హృదయములో ఉండకుండా జాగ్రత్త వహించాలి. మన మెదడులోనికి వెళ్లే సమాచారాన్ని బట్టి దుష్ట తలంపులు ఉద్భవిస్తాయి. టెలివిజన్, సినిమాలు, ఇంటర్నెట్ మొ॥నవి ఇందువిషయమై నిందించ దగినవి. అవి మన కంటికెదురుగా అక్కరలేకున్నను ప్రత్యక్షమవుతాయి. వాటి వలన మన హృదయాల్లో రకరకాల భావాలు ఉత్పన్నమవుతాయి. మరీముఖ్యముగా మంచి కంటే చెడు మన హృదయాల్లో కాపురం చేస్తాది. అట్లయినప్పుడు మనం బుద్ధి పూర్వకముగా మారుమనస్సు పొంది, ప్రార్ధనలో గడిపితే ఆ దుష్టతలంపులు క్రమంగా నిష్క్రమిస్తాయి. ఒకని మనస్సును మంచి తలంపులతో నింపితే అతని మనసాక్షి కూడ మంచిగానే ఉంటుంది.

గనుక ఫిలిప్పయిలో యున్న సహోదరులకు పౌలు యిచ్చిన హెచ్చరిక చాల ముఖ్యము. "మెట్టుకు సహోదరులారా, యే యోగ్యతయైనను మెప్పైనను ఉండిన యెడల ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవిఖ్యాతిగలవో వాటి మీద ధ్యానముంచుకొనుడి" (ఫిలిప్పీ 4:8).

మనజీవితంలోని చెడు సంగతులను తొలగించి మంచివాటితో నింపుకొనవలెనని యేసు చెప్పారు. లేని యెడల ముందున్నవాటి కంటే ఎక్కువ చెడుగు ఖాళీస్థలములో కాపురముండునని యేసు చెప్పారు. ఆయన ఇట్లు చెప్పారు : "అపవిత్రాత్మ ఒక మనుష్యుని వదలిపోయిన తరువాత అది విశ్రాంతి వెదకుచు నీరు లేని చోట్ల తిరుగుచుండును. విశ్రాంతి దొరకనందున - నేను వదలి వచ్చిన నా యింటికి తిరిగి వెళ్లెదననుకొని వచ్చి, ఆ యింట ఎవరును లేక అది ఊడ్చి అమర్చి యుండుట చూచి, వెళ్లి తనకంటె చెడ్డవైన మరి యేడు దయ్యములను వెంటబెట్టుకొని వచ్చును. అందుచేత ఆ మనుష్యుని కడపటి స్థితి మొదటి స్థితి కంటే చెడ్డదగును. ఆలాగే యీ దుష్టతరము వారికి సంభవించును" (మత్తయి 12:43-45).

నెహెమ్యా వలె అక్కరలేని వారిని, లేదా అక్కర లేని వాటిని మన అంత:కరణము నుండి పారద్రోలి వేయాలి. పాతనిబంధన దేవాలయము ఎంత పవిత్రముగను పరిశుద్ధముగను ఉండాలని దేవుడు కోరారో, అట్లే మన హృదయములు అంతే పవిత్రముగా యుండాలి!

- డేన్ వీలర్



# దేవుడిచ్చిన బహుమానము

## (A Gift from God)

బిడ్డలను సరిగ పెంచు విధానము నెరుగుటలో వారు దేవుడిచ్చిన బహుమానమని ప్రతివారు గమనించాలి. కీర్తనకారుడిట్లు వ్రాసాడు. "కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము. గర్భఫలము ఆయన యిచ్చు బహుమానమే. యౌవన కాలమందు పుట్టిన కుమారులు బలవంతుని చేతిలోని బాణముల వంటివారు. వారితో తన అంబుల పొదిని నింపుకొనినవాడు ధన్యుడు. అట్టివారు సిగ్గుపడక గుమ్మములో తమ విరోధులతో వాదించుదురు" (కీర్తన 127:3-5).

బిడ్డలు దేవుని నుండి కలిగిన బహుమానము గనుక వారిని మన చిత్తానుసారముగా గాక దైవచిత్తాను సారముగ పెంచాలి. "దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను; దేవుని స్వరూప మందు వారిని సృజించెను; స్త్రీని గాను పురుషుని గాను వారిని సృజించెను" అని మోషే వ్రాసిన దానిని మనం గ్రహించాలి (ఆది.కా. 1:27).

ప్రతిబిడ్డ ప్రశస్తమైన వాడని, ప్రేమింప బడుచున్న వాడని గ్రహించు కోవాలి. తాను దేవుని చిత్త ప్రకారము నడుచుకొన్నంత కాలము వృత్తిరీత్యా తన జీవన విధానము నెంచుకొనుటకు అతడు స్వేచ్ఛ కలిగినవాడు.

హిజ్కియా చనిపోవుచున్నాడని దేవుడు ప్రవక్తయైన యెషయా ద్వారా అతనికి తెలియజేయగా దేవుని సన్నిధిలో తాను జీవించిన విధానమును దేవుడు జ్ఞాపకమునకు తెచ్చుకోవాలని హిజ్కియా ప్రార్థించాడు. దేవుడతని ప్రాణమును కాపాడగా రాజైన హిజ్కియా తన కృతజ్ఞత వ్యక్తపరుస్తూ ఒక గానము వ్రాసాడు. తన జీవితాన్ని దేవుని స్తుతించుట కొరకు వినియోగిస్తూ, "ఈ దినమున నేను సజీవుడైన నిన్ను స్తుతించు చున్నాను. తండ్రులు కుమారులకు నీ సత్యము తెలియ జేతురు. యెహోవానన్ను రక్షించు వాడు" అని అతడు చెప్పాడు (యెషయా 38:19).

మనం దేవుని స్తుతించాలంటే మన బిడ్డలకు దేవుని సత్యాన్ని బోధించాలి. బిడ్డలు దేవుని వలన కలిగిన బహుమానమని గ్రహించాలి. వారిని ప్రభువు యొక్క బోధనలోను శిక్షణలోను పెంచుటయే మన ధ్యేయం కావాలి (ఎఫెసీ 6:4). మన గృహాల్లో దేవుని వాక్యం మన జీవితాలకు వెలుగునిచ్చు దీపమై ఉండాలి (కీర్తన 119:105).

– గేరీ హాంప్టన

# సంక్షిప్త వార్తలు

2017 డిశంబరు 4వ తేదీనాటికి రిక్కీ గూటం గారు జపాన్ దేశ పర్యటన ముగించుకొని కాకినాడ క్షేమముగా చేరుకొనిరి. జపాన్‌లో టోక్యో నగరము మరికొన్ని నగరములను దర్శించిరి. జపాన్‌లో ఈబరాకి క్రిష్టియన్ కాలేజీ చాలాకాలము నుండి నడుచుచున్నది. అది క్రీస్తు సంఘస్థుల ఆధ్వర్యమున నడిపించబడు చున్నది. రిక్కీ గారు ఈబరాకీలోను, అక్కడనున్న క్రైస్తవ కళాశాలలోను కొన్నిదినములు గడిపిరి. ఆ కళాశాలలో యున్న అనేకమంది ప్రొఫెసర్లు రిక్కీగారి యొక్క స్నేహితులే. జపాన్‌లో ఇంగ్లీషు వచ్చిన వారు చాలా తక్కువ. క్రైస్తవుల సంఖ్య కూడా చాలా తక్కువే. జపాన్ దేశములో సువార్త వ్యాపించునట్లు ప్రార్థించమనవి.

2017, డిశంబరు 5వ తేదీ నాడు జాషువా రాబిన్ గారి కుమారుడు జాషువా రాయన్ గారి మొదటి జన్మదిన వేడుకలు జాషువా గూటం గారి ఇంటిలో ఘనముగా జరిగించబడెను. 5వ తేదీనాడు అనేకమంది బంధుమిత్రులు, సంఘసభ్యులు, పట్టణప్రముఖులు హాజరై జాషువారాయన్ గారిని ఆశీర్వదించిరి. ఆ రోజు జరిగిన కృతజ్ఞతకూటములో కడప నుండి వచ్చిన నిమ్మగడ్డ ప్రేమానందము గారు, జాషువా గారు మంచి వాక్యోపదేశము గావించిరి. యేసుక్రీస్తు శారీరకముగాను, సాంఘికముగాను, ఆత్మీయముగాను ఎట్లు పెరిగిరో వివరిస్తు జాషువా గారు బోధించిరి. ప్రేమానందము గారు 103వ దావీదు కీర్తన ఆధారముగా గొప్ప బైబిలు సత్యములనుపదేశించిరి. రాయన్ గూటం గారి తాతగారు ఎన్. దేవదాసు గారి ప్రార్థనతో కృతజ్ఞత కూటము ముగిసెను. రిక్కీ గూటం గారు అధ్యక్షత వహించి సమస్తము ఘనముగా సకాలమునకు జరిగేలాగున నడిపించిరి. వచ్చిన వారందరికీ మంచి విందు ఏర్పాటు చేయబడెను.

2017 డిశంబరు 19వ తేదీ నాడు ద్వారపూడిలో యున్న క్రీస్తు సంఘము స్త్రీల సహవాస కూడిక నేర్పాటు చేసిరి. కాకినాడ సత్యవాణి క్రీస్తు సంఘము నుండి అనేకమంది స్త్రీలు కూడా వెళ్ళి దానిలో పాల్గొనిరి. సోదరి కబితా గూటం గారు వాక్యపరిచర్య చేసిరి. ద్వారపూడిలో సహో. జి. తిమోతి పాల్ గారు పలు సంవత్సరములుగా సువార్త చాటుచున్నారు.

**'అక్షయ ఆహారము'** అను పుస్తకమును సోదరి కబితా గూటం గారు లిఖించిరి. ఆ పుస్తకము గత అక్టోబరు నెలలో ఆవిష్కరింపబడి అనేకులకు అందజేయబడినది. 143 పేజీలలో 36 గొప్ప ఆత్మీయ అంశములు అందులో వివరించబడినవి. కావలసినవారు సత్యవాణికి రూ. 40/-లు మాత్రమే ఎమ్.ఒ. చేసి పొందవచ్చును.

సత్యవాణి ద్వారా ఇప్పుడు కన్నడ భాషలో కూడ కొన్ని పుస్తకములు లభించుచున్నవి. కర్నాటకలో యున్న మీ పరిచయస్తులకు ఈ సంగతి తెలియజేయవలెను. సువార్త ప్రసంగములు, బైబిలు సంఘము, దైవిక సంఘము అను పుస్తకములు కన్నడలో ఇప్పుడు లభించుచున్నవి.

2017 డిశంబరు 24వ తేదీ రాత్రి వెంకటకృష్ణరాయపురంలో యున్న సంఘము నిర్వహించిన మూడు రోజుల సువార్త కూటములలో ఒక్కరోజు రిక్కీ గారు సువార్త చాటిరి. అక్కడ బొండపాటి రాజారత్నం గారు మంచిపని చేయుచున్నారు.

2017 డిశంబరు ఆఖరివారములో రిక్కీ గూటం గారు నిర్వహించు చున్న చిల్డ్రన్‌హోమ్‌లో యున్న పిల్లలకు క్రొత్తబట్టలు, దుప్పట్లు, పాదరక్షలు పంచిపెట్టబడెను. డిశంబరు 31వ తేదీ రాత్రి జరుగు సంవత్సరాంత వేడుకలలో వారు కంఠస్థ వాక్యములు, బైబిలు చిరునాటికలు వగయిరాలలో పాల్గొందురు. వారందరికీ ఆనాడు అనేక బహుమతులు అనుగ్రహించబడును.

RIN Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2018-2020

From :
SATYAVAKKU
P.O. Box 80, Kakinada - 533001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004